సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 26 । మే । 2024



రూ.25 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు అమలాపురం శ్రీ భ్రమరాంబ చెన్నమల్లేశ్వర స్వామి నెలవారీ లక్షపత్రి పూజా సంఘం రూ.25 వేల విరాళం సమర్పించింది.



ఉసురు తీసిన కలహాలు

కుటుంబ కలహాల కారణంగా దంపతులు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ఆనంద్‌నగర్‌లో శనివారం చోటు చేసుకుంది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0° / 24.3°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	37.0	26.0
కాకినాడ	31.1	24.3
అమలాపురం	38.0	28.0

న్యూస్‌రీల్

27న నిధి ఆప్‌కే నిఖత్

రాజమహేంద్రవరం రూరల్: **ఈపీఎఫ్‌ఓ ప్రాంతీయ** కార్యాలయం పరిధిలోని **వలు ప్రాంతాల్లో** సోమవారం ఉదయం 9 గంటల **నుంచి నిధి ఆప్‌కే నిఖత్ – డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహించ**నున్నారు. అసిస్టెంట్ పీఎఫ్ **కమిషనర్ వైడీ శ్రీని**వాస్ శుక్రవారం ఒక ప్రకటన**లో ఈ విషయం** తెలిపారు. తూర్పు గోదావరి **జిల్లా వేమగిరిలోని** పరమహంస యోగానంద **నేత్రాలయం, డాక్టర్** బీఆర్ అంబేడ్కర్ కోనసీమ **జిల్లాకు సంబంధించి** యానాం శ్రీనివాస పేపర్ మి**ల్లు, కాకినాడ జిల్లా** పిఠాపురంలోని దత్త పీఠం, ఏలూరు **జిల్లా** పెదవేగి కూచిపూడి రోడ్డులోని ఎస్ఎంపీ పబ్లిక్ స్కూలు, తణుకు ఈఎస్ఐసీ బ్రాంచి, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఈఎల్ఐఎం విద్యానికేతన్, అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం పనసలపాలెం పంచాయతీ, గంగవరం మండలం నెల్లిపూడి పంచాయతీ, మారేడుమిల్లి మండలం ఏపీ ఈపీడీసీఎల్ సబ్ స్టేషన్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డిపెండెంట్ పేరెంట్ పెన్షన్, పెన్షనర్లు మృతి చెందితే ఏమి చేయాలి, పెన్షన్ల ప్రయోజనాల కోసం అర్హతలు, డీఎల్‌సీ, ప్రయాస్ – పదవీ విరమణ రోజున పీపీవో, పెన్షన్, ఈడీఎల్ఐ కాలిక్యులేటర్ తదితర అంశాలపై వివరిస్తారన్నారు. ఈ శిబిరాల్లో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందజేయవచ్చన్నారు.

రత్నగిరి.. భక్తజన ఝరి



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిక్కిరిసింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారని అధికారులు తెలిపారు. వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. సత్యదేవుని నిత్యకల్యాణాన్ని పునఃప్రారంభించారు.

సంస్కరణలు ఎంటర్

- ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనంలో నూతన విధానం
- ఆన్‌లైన్‌లో జవాబు పత్రాలు దిద్దే ప్రక్రియకు శ్రీకారం
- విధివిధానాల ఖరారు



సాక్షి, రాజమహేంద్రవరం: జవాబు పత్రాల మూల్యాంకనంలో ఇంటర్మీడియెట్ బోర్డు నూతన సంస్కరణలకు నాంది పలికింది. మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షల జవాబు పత్రాలను పారదర్శకంగా దిద్దేందుకు, పరీక్ష ఫలితాలు త్వరితగతిన వెలువరించేందుకు సరికొత్త విధానాన్ని తెర పైకి తెచ్చింది. దీనిని ఈ ఏడాది ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మాన్యువల్ పద్ధతికి స్వస్తి పలికి, ఎగ్జామినర్లు ఆన్‌లైన్ ద్వారా జవాబు పత్రాలు దిద్దే విధంగా ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ఇంటర్ విద్యా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించిన విధివిధానాలకు సైతం రూపకల్పన చేశారు. ఇప్పటికే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెలాఖరు వరకూ జరుగుతాయి. అనంతరం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నూతన విధానంలో మూల్యాంకనం ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. దీని ప్రకారం అసిస్టెంట్ ఎగ్జామినర్(ఏఈ)గా నియమితులైన అధ్యాపకుడు జూనియర్ కళాశాలల్లో లేదా ఇంటి వద్ద నుంచే జవాబు పత్రాలను దిద్దవచ్చు. దీనివలన కళాశాలల్లో విద్యా బోధనకు ఎటువంటి ఆటంకమూ ఏర్పడదు. పైగా స్పాట్ వాల్యుయేషన్ ఖర్చు సైతం తగ్గనుంది.

ఆన్‌లైన్ మూల్యాంకనం ఇలా..

ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం జవాబు పత్రాలను స్కాన్ చేసి, ఏటగా ఎంపిక చేసిన అధ్యాపకుడికి ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ప్రత్యేకంగా కేటాయించే కోడ్ ఆధారంగా ఆ అధ్యాపకుడు కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్‌లో ఓపెన్ చేసి, తాను పని చేసే కాలేజీ లేదా ఇంటి వద్ద ఆ జవాబు పత్రాలను మూల్యాంకనం చేయవచ్చు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఎప్పుడైనా ఈ జవాబు పత్రాలు దిద్దే వెసులుబాటు కల్పించారు. అయితే ఈ ప్రక్రియ మొత్తం తప్పనిసరిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే నిర్వహించాలి. ప్రతి ఎగ్జామినర్ 'టీక్యూడీ' ద్వారా లాగిన్ అయి, వెంటనే పాస్‌వర్డ్ మార్చుకోవాలి. ముందుగా ఐదు ప్రాక్టీస్ పేపర్లు మూల్యాంకనం చేసిన తర్వాత రెగ్యులర్ పేపర్లు అదుబాటులోకి వస్తాయి. రోజుకు 60 పేపర్ల వరకూ మూల్యాంకనం చేసేందుకు అవకాశం కల్పించారు.

ఇబ్బందులకు చెల్లు

ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఇప్పటి వరకూ మాన్యువల్ విధానంలోనే ఎగ్జామినర్లు నిర్వహించే వారు. దీనివలన ఈ ప్రక్రియ ఆలస్యమై, ఫలితాల విడుదలలో సైతం జాప్యం జరిగేది. ఈ పరిణామం విద్యార్థుల అడ్మిషన్లపై పడేది. మరోవైపు తరగతుల నిర్వహణలో అధ్యాపకులు సైతం ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వీటన్నింటినీ అధిగమించేందుకు ఆన్‌లైన్ మూల్యాంకనం ఎంతో ఉపయోగపడనుంది. ఈ విధానంలో ఎక్కడా ఎటువంటి పొరపాట్లకూ ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మాన్యువల్‌గా పేపర్లు దిద్దే సమయంలో మార్కులు టోటల్ చేయడంలో పొరపాట్లు జరిగేవి. కొన్ని ప్రశ్నలకు మార్కులు వేయడం, మరికొన్నింటికి మరచిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకునేవి. అనంతరం రీ–వెరిఫికేషన్‌లో అసలు సంగతి బహిర్గతమయ్యేది. ఇలాంటి ఘటనలు అటు ఇంటర్ బోర్డు అధికారులకు, తల్లిదండ్రులకు తలనొప్పి వ్యవహారంగా మారేది. ఆన్‌లైన్ విధానంతో వీటన్నింటినీ కట్టడి చేసే వీలుంటుందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

స్కానింగ్ సెంటర్ ఏర్పాటు

జవాబు పత్రాలు దిద్దే ప్రక్రియలో గతంలో ప్రతి జిల్లా కేంద్రంలో జిల్లా రీ కలెక్షన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ (డీఆర్‌డీసీ) ఉండేది. ఆన్‌లైన్ విధానం అమలులోకి తీసుకురానున్న తరుణంలో డీఆర్‌డీసీకి బదులు రీజినల్ రిసెప్షన్ స్కానింగ్ సెంటర్ (ఆర్ఆర్ఎస్‌సీ) అందుబాటులోకి తీసుకురానున్నారు. గతంలో ప్రతి జిల్లాలోని జవాబు పత్రాలను సేకరించి జంబ్లింగ్ విధానంలో ఇతర జిల్లాలకు పంపేవారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, కర్నూలు జిల్లాల్లో స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ స్కానింగ్ సెంటర్ ఉంటుంది. ఏరోజుకారోజు పరీక్ష పూర్తయిన వెంటనే స్పీడ్ పోస్టు ద్వారా ఆర్ఆర్ఎస్‌సీ కేంద్రాలకు జవాబు పత్రాలను పంపుతారు. ఆ కేంద్రాల్లో స్కాన్ చేసిన జవాబు పత్రాలను నిర్దేశిత ఎగ్జామినర్లకు పంపుతారు. వారు వెంటనే ఆన్‌లైన్ మూల్యాంకనం చేపడతారు.

ఒక్క ప్రశ్న చూడకపోయినా..

ఆన్‌లైన్ మూల్యాంకనంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. పేపర్లు దిద్దే సమయంలో ఒక ప్రశ్నకు విద్యార్థి రాసిన సమాధానాన్ని ఎగ్జామినర్ పూర్తిగా పరిశీలించి, మార్కులు వేసిన తరువాతే మరో ప్రశ్న ప్రత్యక్షమవుతుంది. అన్ని ప్రశ్నలూ పూర్తయ్యాక ఫైనల్ సబ్‌మిట్ దర్శనమిస్తుంది. విద్యార్థులు జవాబు రాసినా, రాయకపోయినా అన్ని ప్రశ్నలనూ పరిశీలించాల్సి ఉంటుంది. ఫలితంగా అన్ని ప్రశ్నలకూ తప్పనిసరిగా మార్కులు వేయాల్సి ఉంటుంది. ఎగ్జామినర్ మూల్యాంకనం పూర్తి స్థాయిలో చేశారా లేదా అనే విషయాన్ని చీఫ్ ఎగ్జామినర్ (సీఈ), ఇంటర్ బోర్డ్ అధికారులు పరిశీలిస్తారు.

జిల్లాలో ఇలా..

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 25 కేంద్రాల్లో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు 19,794 మంది విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. జనరల్ విభాగంలో మొదటి సంవత్సరం 14,788 మంది, ద్వితీయ సంవత్సరంలో 3,624 పరీక్షలకు హాజరువుతున్నారు. ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం 801, ద్వితీయ సంవత్సరంలో 581 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు.

నూతన విధానంలో మూల్యాంకనం



ఆన్‌లైన్ విధానంలో జవాబు పత్రాలు దిద్దేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం. రాజమహేంద్రవరం స్కానింగ్ సెంటర్‌కు సుమారు 2.25 లక్షల జవాబు పత్రాలు రానున్నాయి. మూల్యాంకనంపై ఇప్పటికే అధ్యాపకులకు శిక్షణ ఇచ్చాం. తిరిగి ఆదివారం మరోసారి అవగాహన కల్పిస్తాం. ఈ విధానం చాలా మంచిది. అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్ మూల్యాంకనంతో అటు బోధన సాగిస్తూనే.. మూల్యాంకనం చేసుకునే వెసులుబాటు అధ్యాపకులకు కలుగుతుంది.

– ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, ఇంటర్మీడియెట్ బోర్డ్ ప్రాంతీయ అధికారి, రాజమహేంద్రవరం

ధ్వజస్తంభం స్వర్ణ తాపడం పనులకు శ్రీకారం



ధ్వజస్తంభం రాగి తొడుగులను పరిశీలిస్తున్న ఈఓ రామచంద్ర మోహన్. (అంతర చిత్రం) సత్యదేవుని ధ్వజస్తంభానికి రాగి తొడుగులను అమర్చుతున్న సిబ్బంది

అన్నవరం: స్థానిక సత్యదేవుని దేవస్థానంలో నూతన ధ్వజస్తంభానికి స్వర్ణ రేకు తాపడం చేసే పనులు ప్రారంభమయ్యాయి. మండపేటకు చెందిన చిన్నా బృందం సుమారు 300 కిలోల రాగితో రూపొందించిన ధ్వజస్తంభం తొడుగులను స్తంభానికి అమర్చి సరిచూశారు. కొలతలను సరిచూసిన అనంతరం వాటిని తొలగించారు. ఈ రాగి తొడుగులను దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ పరిశీలించారు. వీటికి బంగారు పూత పూసి ధ్వజస్తంభానికి అమర్చుతారు. ఈ పనిని చెన్నైకు చెందిన స్మార్ట్ క్రియేషన్స్‌కు ధ్వజస్తంభం నిర్మాణ దాతలు అప్పగించారు. ఆ సంస్థ గతంలో అన్నవరం దేవస్థానంలో స్వామివారి ఆలయ పునర్నిర్మాణ సమయంలో బంగారు మకర తోరణం, రుద్రాక్ష మండపం, బంగారు ఊయల, గొడుగు, అంతరాలయంలో పైకప్పునకు బంగారు తాపడం, వనదుర్గ అమ్మవారికి మకరతోరణం తదితరాలను రాగితో తయారు చేసి బంగారు పూత పూశారు. ఇప్పటికీ అవి వెలసిపోలేదు. ఈ రాగి తొడుగులకు బంగారు పూత వేయించేందుకు చెన్నైకు ఒకటి, రెండు రోజుల్లో తరలించనున్నట్లు దేవస్థానం ఇంజినీరింగ్ డీఈఈ ఉదయ్ శనివారం తెలిపారు. ఈ ధ్వజస్తంభానికి బంగారు పూత పూసేందుకు 24 క్యారెట్ బంగారం రెండు కిలోలు ఉపయోగిస్తామని చెన్నై స్మార్ట్ క్రియేషన్స్ జీఎం సత్యనారాయణరెడ్డి తెలిపారు. దాత బంగారం అందజేసిన వెంటనే ఈ పనులు ప్రారంభిస్తామన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు వేళాయె..

- రేపటి నుంచి కౌన్సెలింగ్.. సర్టిఫికెట్ల పరిశీలన
- 31 నుంచి ఆప్షన్ల ఎంపిక
- 7న సీట్ల కేటాయింపు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. పాలిసెట్ జిల్లా కన్వీనర్, బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు శనివారం ఈ విషయం తెలిపారు. ఆ వివరాలివీ..

- సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. దీనికోసం బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాలలో అవసరమైన ఏర్పాట్లు చేశారు.
- షెడ్యూల్‌లో ప్రకటించిన ప్రకారం ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరిగే ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు విద్యార్థులు వారి ర్యాంకుల ప్రకారం హాజరు కావాలి.

విద్యార్థులకు ఇవీ సూచనలు

- ఓసీ, బీసీ కేటగిరీల వారు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి.
- ప్రాసెసింగ్ ఫీజు రశీదుతో పాటు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఒరిజినల్ మార్కుల జాబితా లేదా ఇంటర్‌నెట్ కాపీ తీసుకుని రావాలి.
- నాలుగు నుంచి పదో తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వారికి 2021 జనవరి 1 తర్వాత జారీ చేసిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకుని రావాలి.
- ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు (ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, సీఏపీ, పీడబ్ల్యూడీ, స్కౌట్స్ అండ్ గైడ్స్) విజయవాడ బెంజి సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 3వ తేదీలోగా హాజరు కావాల్సి ఉంటుంది.
- విద్యార్థులు ఈ నెల 31 నుంచి వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకూ 1 నుంచి 50,000 ర్యాంకులు పొందిన వారు, జూన్ 2, 3 తేదీల్లో 50,001 – 90,000 ర్యాంకుల వారు, జూన్ 4, 5 తేదీల్లో 90,001 నుంచి చివరి ర్యాంకు వరకూ విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు.



బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల

వి.నాగేశ్వరరావు

ర్యాంకుల వారీగా షెడ్యూల్

తేదీ	ర్యాంకులు
మే 27	1 – 12,000
28	12,001 – 27,000
29	27,001 – 43,000
30	43,001 – 59,000
31	59,001 – 75,000
జూన్ 1	75,001 – 92,000
2	92,001 – 1,08,000
3	1,08,001 – చివరి ర్యాంకు వరకూ

విజయవాడలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఇలా..

తేదీ	కేటగిరీ	ర్యాంకులు
మే 31	ఎన్‌సీసీ	1 – 40,000
	ఆంగ్లో ఇండియన్	1 – చివరి ర్యాంకు వరకూ
జూన్ 1	స్పోర్ట్స్ అండ్ గేమ్స్	1 – 60,000
	ఎన్‌సీసీ	40,001 – 80,000
2	స్పోర్ట్స్ అండ్ గేమ్స్	60,001 – చివరి ర్యాంకు వరకూ
	ఎన్‌సీసీ	80,001 – చివరి ర్యాంకు వరకూ
3	సీఏపీ, పీడబ్ల్యూడీ, స్కౌట్స్ అండ్ గైడ్స్	1 – చివరి ర్యాంకు వరకూ

- ఆప్షన్లు మార్చుకునేందుకు జూన్ 5న అవకాశం ఇస్తారు.
- జూన్ 7న కళాశాలల్లో సీట్ల కేటాయింపు ఉంటుంది.
- వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీపీఓఎల్‌వైసీఈటీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లు సిద్ధం

- నియోజకవర్గాల వారీగా ఏర్పాటు
- స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్

రాజానగరం: వచ్చే నెల 4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూములను, ఆ ప్రాంగణంలో భద్రతను శనివారం ఆమె పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించి, సూచనలు చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజవర్గాలకు 14 చొప్పున, పరిశీలకునికి, పోస్టల్ బ్యాలెట్లకు 129 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ పరిశీలకులకు ఒక టేబుల్ ఉంటుందన్నారు. నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎంపీ అభ్యర్థులకు పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన బ్లాక్‌లలో లెక్కిస్తారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్లను యూనివర్సిటీ సెంట్రల్ పరిపాలన భవనం రెండో అంతస్తులో 14 టేబుళ్లపై లెక్కిస్తారు. అలాగే మరో 4 టేబుళ్లపై ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీబీపీఎస్) ఓట్లను లెక్కిస్తారన్నారు.

ఈవీఎంల ఓట్లు లెక్కిస్తారిలా..

- అనపర్తి నియోజకవర్గం ఈవీఎం ఓట్లను ఎన్–బ్లాక్‌లో లెక్కిస్తారు. ఎంపీ ఓట్లను 215, 216 రూముల్లో, ఎమ్మెల్యే ఓట్లను 218, 218ఏ రూముల్లో లెక్కిస్తారు.
- ఇంజినీరింగ్ వర్క్‌షాప్ భవనం కింది అంతస్తులో రాజానగరం నియోజకవర్గ పరిధిలోని ఎంపీ ఓట్లు, మొదటి అంతస్తులో ఎమ్మెల్యే ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- రాజమండ్రి సిటీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్–బ్లాక్ ఈస్ట్ వింగ్ 317 రూములో ఎంపీ ఓట్లు, 320, 321 రూముల్లో ఎమ్మెల్యే ఓట్ల లెక్కింపు చేపడతారు.
- ఎన్–బ్లాక్ 119 రూములో రాజమండ్రి రూరల్ ఎంపీ ఓట్లు, 111, 112 రూముల్లో ఎమ్మెల్యే ఓట్లు లెక్కిస్తారు.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

- కొవ్వూరు నియోజకవర్గం ఎంపీ ఓట్లను ఎన్–బ్లాక్ 2వ అంతస్తులోని 314 రూములో, ఎమ్మెల్యే ఓట్లను 315, 316 రూముల్లో లెక్కిస్తారు.
- ఎన్‌టీఆర్ కన్వెన్షన్ సెంటర్ దిగువ అంతస్తులో 101/ఏ రూములో నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని ఎంపీ ఓట్లు, 108/ఏలో ఎమ్మెల్యే ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- గోపాలపురం నియోజకవర్గానికి సంబంధించి ఎన్‌టీఆర్ కన్వెన్షన్ సెంటర్ మొదటి అంతస్తులో ఉత్తరం వైపు ఉన్న కాన్ఫరెన్స్ హాలులో ఎంపీ ఓట్లు, దక్షిణం వైపు ఉన్న కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్యే ఓట్ల లెక్కింపు చేపడతారు.

క్లుప్తంగా

ఉసురుతీసిన కలహాలు



శ్రీధర్, దేవి మృతదేహాల వద్ద బంధువు రోదన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కుటుంబ కలహాల కారణంగా అనుమానాస్పదంగా దంపతులు మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ఆనంద్‌నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. అయితే సంఘటనా స్థలంలో ఆధారాలను బట్టి భార్యను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. జగ్గంపేటకు చెందిన శ్రీధర్ (28)కు ప్రత్తిపాడుకు చెందిన దేవి (22)కి ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు. తాపీ పనిచేసుకునే శ్రీధర్‌కు ఏడాది కిందట ప్రమాదం జరగడంతో వేరొకరిపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. భార్య దేవికి ఫిట్స్ ఉన్నాయి. ఇదిలా ఉండగా భార్యాభర్తలు తరచూ ఘర్షణ పడేవారు. ఈ నేపథ్యంలో భార్య దేవి నెల రోజుల కిందట పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను కాపురానికి తీసుకు వచ్చేందుకు శ్రీధర్ వారం కిందట అత్తారింటికి వెళ్లాడు. పిల్లలను ప్రత్తిపాడులో వదిలేసి భార్యాభర్తలిద్దరూ కలసి ఆనంద్‌నగర్‌లోని ఇంటికి శనివారం ఉదయం 10.30 గంటలకు వచ్చారు. వస్తూ శ్రీధర్ వెంట మద్యం బాటిల్ తెచ్చుకున్నాడు. అప్పటి నుంచి మధ్యాహ్నం వరకూ తలుపు వేసి ఉండడం, ఇంటి లోపలకు వెళ్లిన వారు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు తలుపులు ఎంత తట్టినా తీయలేదు. అనుమానం వచ్చి ఇంటి వెనుకవైపు నుంచి వెళ్లి తలుపులు తీసి చూడగా భార్యాభర్తలిద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. దీంతో ఈ విషయాన్ని మూడో పట్టణ పోలీసులకు తెలిపారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. దేవి మెడకు చున్నీ ఉండడం, ఆమె కిందపడిపోవడంతో ఆమెను చంపి శ్రీధర్ ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను సీఐ వీరయ్య గౌడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మార్కెట్‌లోకి టయోటా అర్బన్ క్రూజర్ టైజర్



మార్కెట్‌లోకి టయోటా అర్బన్ క్రూజర్ టైజర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: కిర్లోస్కర్ మోటార్స్ వాహనాల అధీకృత డీలర్ పృథ్వీ టయోటా శనివారం రాజమహేంద్రవరం షోరూంలో సరికొత్త టయోటా అర్బన్ క్రూజర్ టైజర్ వాహనాన్ని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కేఎస్ఎంవీ కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పృథ్వీ మోటార్స్ ఎండీ పృథ్వీచంద్ర మాట్లాడుతూ మార్కెట్‌లోకి వచ్చిన టయోటా అర్బన్ క్రూజర్ టైజర్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనమని తెలిపారు. ఇందులో 1.0 ఎల్ టర్బో, 1.2 ఎల్ డ్యూయల్ జెట్, డ్యూయల్ వివిటీ పెట్రోల్, ఈ– సీఎస్‌జీతో పాటు 5 స్పీడ్ మాన్యువల్, 6 స్పీడ్ ఆటో ట్రాన్స్‌మిషన్ కలిగి ఉందన్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ వాహనంలో అంచనాలకు మించి ఇంటీరియర్స్ ఉంటాయన్నారు. వివిధ శ్రేణుల్లో 16 ఎల్లాయ్, ట్విన్ ఎల్డీ డీఆర్ఎల్, డ్యూయల్ టోన్ ఎక్స్టీరియర్, హెడ్ అప్ డిస్‌ప్లే, 9 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే, కాస్ట్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టం, 6 ఎయిర్ బ్యాగ్స్ వంటి అధునాతన, భద్రత ప్రమాణాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ వాహనం ప్రారంభ ధర రూ.7,73,500 అన్నారు. మైలేజ్ పెట్రోల్ వేరియంట్‌లో 22.8 కిలోమీటర్లు, ఈ– సీఎస్‌జీ వేరియంట్‌లో కిలోకి 28.5 కిలోమీటర్లు ఇస్తుందన్నారు. టయోటా ఏరియా మేనేజర్ శశికాంత్, సీఈఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వానలు కాబట్టీ ఇబ్బందులు

- కుదేలైన ఇటుకల పరిశ్రమ
- బట్టీల్లో తడిసిపోతున్న సరకు
- దిక్కుతోచని స్థితిలో యజమానులు



ఆలమూరులోని ఓ బట్టీలో పచ్చి ఇటుక నిల్వలు



ఆలమూరులో తడిసిన పచ్చి ఇటుకలు

కొత్తపేట: ఇటుకల పరిశ్రమ కుదేలైంది.. బట్టీల యజమానులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది.. పెట్టుబడి పెరిగి, లాభాలు లేక పరిశ్రమ నష్టాల ఊబిలో కూరుకుపోయింది. దీనికితోడు తాజాగా అల్పపీడనం ప్రభావంతో వర్షాల కారణంగా తయారైన పచ్చి ఇటుక తడిసి ముద్దవుతోంది. రెండు వారాల వ్యవధిలో అకాల వర్షాలతో తీవ్ర నష్టం ఏర్పడింది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఆంక్షల కారణంగా ప్రభుత్వ నిర్మాణాలు నిలిచిపోవడంతో ఇటుకల పరిశ్రమ నష్టాల బాట పట్టింది. మూడు నెలలుగా తగిన స్థాయిలో అమ్మకాలు, ఎగుమతులు లేక తయారైన ఇటుకలు బట్టీల్లోంచి బయటకు వెళ్లని పరిస్థితి. ఎన్నికల అనంతరం మళ్లీ నిర్మాణాలు చురుగ్గా ప్రారంభమై ఇటుక అమ్మకాలు జోరందుకుంటాయని యజమానులు ఆశతో ఉన్నారు. ఇందులో భాగంగా వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వేసవిలో ఇటుకతీత జోరుగా చేపట్టారు. అందుకు ఇతర ప్రాంతాల నుంచి కార్మికులకు ముందస్తు పెట్టుబడి పెట్టి మరీ తీసుకు వచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో మండు వేసవిలో సైతం ఈ నెల 7న ఒక్కసారిగా వాతావరణం మారి భారీ వర్షాలు కురిశాయి. దాంతో కాల్చడానికి సిద్ధం చేసిన పచ్చి ఇటుకను బట్టీ నిర్వాహకులు ఉరుకులు, పరుగున బరకాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయినా ఈదురు గాలులతో బరకాలు ఎగిరిపోయి నెట్టి కట్టిన ఇటుక చాలా వరకూ తడిసిపోయి మళ్లీ మట్టిగా కరిగిపోయింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి శుక్రవారం కురిసిన వర్షానికి కళ్లంలో ఆరబెట్టిన, నెట్టి కట్టిన పచ్చి ఇటుకలో సగభాగం తడిసిపోవడం నిర్వాహకులను కుంగదీస్తోంది.

జిల్లాలో 850 ఇటుక బట్టీలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆలమూరు, జొన్నాడ, మూలస్థానం, చొప్పెల్ల, చెముడులంక, బడుగువానిలంక, మడికి, పినపళ్ల, పెదపళ్ల, సంధిపూడి, కొత్తపేట, మందపల్లి, వానపల్లి, కపిలేశ్వరపురం, కేదార్లంక, వీదివారిలంక, అంగర, ఊబలంక, గోపాలపురం, ఆత్రేయపురం మండలం అంకంపాలెం, బొబ్బర్లంక, వెలిచేరు, ర్యాలి తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ఇటుక బట్టీలు ఉన్నాయి. అలాగే ముక్తేశ్వరం, అయినవిల్లి లంక, బోడసకుర్రు, ముమ్మిడివరం, ఐ.పోలవరం, పి.గన్నవరం, పాశర్లపూడి, రాజోలు తదితర ప్రాంతాల్లో కూడా ఇటుక పరిశ్రమకు సంబంధించి సుమారు 850కు పైగా బట్టీలు ఉన్నాయి. రోజూ సుమారు 10 లక్షల నుంచి 12 లక్షల ఇటుకల ఉత్పత్తి జరుగుతుందని అంచనా. వాటికి ముడి సరకుకు కావాల్సిన మట్టి లంక ప్రాంతాల్లో, వేసవి సీజన్‌లో రేవడి భూముల్లో కొనుగోలు చేసి సమకూర్చుకుని నిల్వ చేసుకుంటారు. ఈ సారి వేసవిలో అకాల వర్షాలతో తవ్వకాలు లేక రాబోయే కాలానికి సంబంధించి ఇంత వరకూ మట్టి సమకూర్చుకోలేదని యజమానులు వాపోయారు.

అంతకంతకూ పెరుగుతూ..

ఇటుక తయారీకి మట్టి, ఊక, కొబ్బరిపీచు పొట్టు, బూడిద, కూలీల అడ్వాన్సులు విపరీతంగా పెరిగిపోయి లాభాలు అంతగా ఉండడం లేదని యజమానులు అంటున్నారు. గతంలో లారీ మట్టి రూ.6 వేలు ఉండగా ఇప్పుడు రూ.15 వేలు, టన్ను ఊక రూ.500 ఉండగా రూ.6 వేలకు పెరిగిపోయింది. గతంలో పీచు పరిశ్రమల వద్ద వృథాగా వదిలేస్తే తెచ్చుకునే పీచు పొట్టు ఇప్పుడు ట్రాక్టరు రూ.15 వేలు పలుకుతుంది. వివిధ ఫ్యాక్టరీల నుంచి ఉచితంగా తెచ్చుకునే లారీ బూడిదకు రూ.25 వేలకు ఇవ్వాల్సి వస్తుంది. బట్టీ కూలీలను ఒడిశా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వారి జోడాకు రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ అడ్వాన్సులు ఇవ్వాల్సి వస్తుందని యజమానులు అంటున్నారు. ఈ విధంగా ఒక్కో బట్టీలో పని చేసే కూలీలపై పెట్టుబడి రూపంలో రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఉంటుందని తెలిపారు. ఒక ఇటుక తయారీకి రూ.6.50 ఖర్చు అవుతుంది. గతంలో ఇటుక రూ.9 వరకూ పలకగా ప్రస్తుతం రూ.5.50కి పడిపోయిందని అంటున్నారు.

తయారీ ఖర్చు వృథా



ఇటుక పరిశ్రమలో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. లాభాల మాట దేవుడెరుగు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాం. తాజాగా అకాల వర్షాలకు ఇటుక పరిశ్రమ నష్టాల్లో నడుస్తుంది. ఈ నెలలో వరుసగా రెండుసార్లు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. తయారైన ఇటుక కళ్లాలపై ఆరబెట్టగా వర్షాలకు తడిసి ముద్దయ్యింది. దీనివల్ల తయారీ ఖర్చు అంతా వృథా అయ్యింది.

–చల్లా ప్రభాకరరావు, ప్రెసిడెంట్, ఉమ్మడి జిల్లా ఇటుక బట్టీల యజమానుల సంఘం

ఊడిమూడి ప్రమాదంలో ఆరుకు చేరిన మృతులు

- ఆర్టీసీ బస్సు కండక్టర్ మృతి
- ఆదుర్రులో విషాదఛాయలు



శ్రీనివాసరావు (ఫైల్)

పి.గన్నవరం: రాజవరం– పొదలాడ రోడ్డులో ఊడిమూడి గ్రామం వద్ద ఇటీవల ధాన్యం లోడు ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు కండక్టర్ కడలి శ్రీనివాసరావు (52) శుక్రవారం రాత్రి చెందారు. దీంతో ఈ ప్రమాద మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఈ నెల 14వ తేదీ సాయంత్రం పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామం వద్ద రోడ్డు పక్కన పది మంది కూలీలు ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు లోడ్‌చేసి పగ్గాలు కడుతుండగా.. రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యవసాయ కార్మికులు జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యనారాయణ, ఈరి కట్లయ్య, ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, మణిబాబు సోదరుడు చిలకలపూడి సురేష్ కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న కండక్టర్ ఎగిరి ఫుట్‌పాత్‌పై పడిపోయాడు. ప్రమాదంతో ఆందోళనకు గురైన బస్సులోని ప్రయాణికులు ఫుట్‌పాత్‌పై పడిఉన్న కండక్టర్‌ను గమనించకుండా అతడిపై నుంచి కిందకు దిగిపోయారు. ఇలా తీవ్ర గాయాలపాలైన కండక్టర్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కండక్టర్ మృతితో ఆయన స్వగ్రామమైన మామిడికుదురు మండలం ఆదుర్రులో విషాద ఛాయలు అలముకున్నాయి. కండక్టర్ శ్రీనివాసరావుకు భార్య భవానీ, కుమార్తెలు లోకేశ్వరి, నాగేశ్వరి ఉన్నారు. అతడి మృతదేహానికి శనివారం అమలాపురం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ ప్రశాంత కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

నీలమేఘశ్యామా నమో నమామి..



భక్తులతో పోటెత్తిన ఆలయ ప్రాంగణం

- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం
- ఒక్కరోజే రూ 37.28 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: గోవింద నామస్మరణతో వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం మార్మోగింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించి, దర్శనభాగ్యం కల్పించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారితో పాటు ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తుల రాకతో ప్రాంగణం మరింత కిక్కిరిసింది. ఆలయాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు. ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ విక్రయాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.37,28,574 ఆదాయం సమకూరిందన్నారు. అన్న సమారాధనలో వేలాది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అవినీతి అందిపుచ్చుకుంటూ..

- నాడు ఎస్సై.. నేడు సీఐ
- లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం
- రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో దందా



ఏసీబీకి చిక్కిన సీఐ సీహెచ్ ఆంజనేయులు



రావులపాలెం పోలీస్ స్టేషన్



ఏసీబీకి పట్టుపడిన ఎస్సై వెంకటరమణ, కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్ (ఫైల్)

రావులపాలెం: కుర్చీ మహిమో.. చేతినిండా సంపాదించాలనే తాపత్రయమో.. అవినీతి మరకను ఒకరి తర్వాత ఒకరు పుచ్చుకుంటూ తలవంపులు తెస్తున్నారు. ప్రతి పనికీ చేయిచాపి, చివరికి ఏసీబీ వలకు చిక్కుతూ ఉన్న పరువును రచ్చకెక్కిస్తున్నారు. ఇప్పుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలోని రావులపాలెం పోలీస్ స్టేషన్ అంతటా హాట్‌టాపిక్‌గా మారింది. ఐదు నెలల వ్యవధిలోనే ఇక్కడ పనిచేసిన అధికారులు ఇద్దరు లంచం తీసుకుంటూ దొరికిపోవడం చర్చనీయాంశం అయ్యింది. నాడు ఎస్సై అవినీతికి పాల్పడుతూ వలలో చిక్కగా, నేడు అదే స్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న సీఐ ఏసీబీకి పట్టుబడటం గమనార్హం. ఆ వివరాల్లోకి వెళ్తే.. గతంలో రావులపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓకి ఎస్సై ర్యాంకు అధికారి ఉండేవారు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత ఈ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి ఎస్సై స్థానంలో సీఐ స్థాయి అధికారిని నియమించారు. గత జనవరిలో ఇదే స్థానంలో ఎస్సై హోదాలో ఉన్న అప్పటి ఎస్సై ఎం.వెంకటరమణ ఒక కేసులో 41 నోటీస్ జారీ చేసే విషయంలో ముద్దాయిని స్టేషన్‌కు పిలిచి చార్జిషీట్‌లో తక్కువ శిక్షపడేలా సెక్షన్లు మార్చి సహాయ పడతానంటూ, ఆ కేసులో అనపర్తి మండలం పొలమూరుకు చెందిన సత్తి విజయరామకృష్ణారెడ్డి నుంచి రూ. లక్ష డిమాండ్ చేశారు. దానికి బాధితుడు అంగీకరించకపోవడంతో రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి ఆ సొమ్ము తీసుకుంటూ అప్పటి ఎస్సై వెంకటరమణ, కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్‌లు ఏసీబీకి చిక్కారు. జనవరి 9న ఈ ఘటన జరగ్గా, అదే నెలలో 13న అప్‌గ్రేడ్ స్టేషన్‌గా మారిన రావులపాలెం పోలీస్ స్టేషన్‌కు సీఐగా తణుకు రూరల్ నుంచి బదిలీపై వచ్చిన సీహెచ్ ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. మొదటి నుంచీ సీఐపై పలు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఎన్నికల అనంతరం తిరిగి పశ్చిమ గోదావరి జిల్లా వెళ్లేందుకు ఇప్పటికే సీఐ సన్నాహాలు చేసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాత కేసుల్లో నిందితుల నుంచి సొమ్ము దండుకోవాలనే లక్ష్యంతో వారం రోజులుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీనికోసం కిందిస్థాయి సిబ్బందితో వివిధ కేసుల్లో బాధితులకు ఫోన్లు చేయించి స్టేషన్‌కు రావాలని పిలిపిస్తున్నారు. గతనెల 16న రావులపాలెం మండలం పొడగట్లపల్లి వద్ద కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి, పలువురిని అరెస్ట్ చేయడంతో పాటు, వాహనాలు, కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో లక్ష్మణరాజును రూ.50 వేలు ఇవ్వాలని పలుమార్లు బాధించడంతో, అతను విసిగిపోయి రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతని నుంచి రూ.50 వేల లంచాన్ని తీసుకుంటూ సీఐ ఆంజనేయులు ఏసీబీ అధికారులకు చిక్కాడు.

వెసులుబాటును అస్త్రంగా మలచుకుని..

నాడు ఎస్సై రూ.25 వేలు, నేడు సీఐ రూ. 50 వేలు తీసుకుంటూ పట్టుబడడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇక్కడకు ఏ అధికారి వచ్చినా అవినీతి మాత్రం తగ్గడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఏడేళ్ల లోపు శిక్షపడే కేసులను కోర్టుకు తీసుకు వెళ్లకుండా 41 నోటీస్ జారీచేసి పంపించే విధంగా చట్టంలో ఉన్న వెసులుబాటును అస్త్రంగా మలచుకుని రూ. వేలల్లో డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు, జిల్లాస్థాయి అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



రాజులోవ (ఫైల్)

రౌతులపూడి: ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రౌతులపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బేతా రాజులోవ (38) కొంతకాలంగా తూర్పుగోదావరి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయనకు శుభలక్ష్మితో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరు రాజమహేంద్రవరం లాలాచెరువు వద్ద తమ నాలుగేళ్ల కుమారుడితో నివసిస్తున్నారు. రాజానగరం మండల సీతానగరం సచివాలయంలో శుభలక్ష్మి అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుంది. ఇటీవల వీరిరువురి దాంపత్య జీవితంలో కలహాలు రేగాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇంటి నుంచి బయటకు వచ్చిన రాజులోవ రామకృష్ణాపురంలోని తమ పొలంలో మకాం వద్ద పాక దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తండ్రి పొలానికి వచ్చి పాకలో ఉరివేసుకుని ఉన్న తన కుమారుడు రాజులోవను చూసి నిర్ఘాంతపోయాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులతో కలసి రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అబ్దుల్ నబీ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి భార్య శుభలక్ష్మి, తండ్రి బాబూరావు నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ముసలమ్మ (ఫైల్)

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో వృద్ధురాలు కొంజర్ల ముసలమ్మ (102) శుక్రవారం రాత్రి మృతి చెందారు. వృద్ధాప్యంతో కొంత కాలంగా అస్వస్థతగా ఉన్న ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. పలువురు సంతాపం తెలిపారు.